క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం వేంచేసి యున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణం పనులకు గ్రామానికి చెందిన ఏలూరి అశోక్‌బాబు రూ.1,00,116లు విరాళంగా అందజేసారు. గుంటూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డికి విరాళం చెక్‌ను అందజేశారు. అమ్మవారి ఆలయం పునర్నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని ఈఓ సుధాకరరెడ్డి కోరారు.

నేడు పోట్లూరులో జగనన్న సురక్ష

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ సచివాలయం పరిధిలో నేడు జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు కోరారు. బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సచివాలయ ఉద్యోగుల వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్నీ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో 1521 నివాస గృహాలు ఉండగా వలంటీర్లు 1054 నివాస గృహాలను సర్వే చేసినట్లు చెప్పారు. వలంటీర్లు 323 టోకెన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. సర్పంచ్ పోపూరి జ్యోతి, వైఎస్ ఎంపీపీ నంబూరి ప్రభావతి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, కార్యదర్శి కొమిటినేని అశోక్‌చౌదరి గ్రామస్తులు పాల్గొన్నారు.

కౌలు చేసే వారు అర్హులే



బొల్లాపల్లి : పొలం కౌలు చేసే ప్రతి రైతు కౌలు రైతు కార్డు అర్హత ఉందని తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. మండలంలోని వెల్లటూరు రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు బుధవారం అవగాహన నిర్వహించారు. అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు కార్డు అందజేస్తామన్నారు. ఈ కార్డుల వలన పొలం యజమానులకు చేకూరే లబ్ధిలో ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. పంట నమోదు చేసుకోవచ్చని, పంట సాగులో నష్టం వాటిల్లితే నష్టపరిహారం పొందవచ్చని అన్నారు. అసలు భూమి లేని కౌలు రైతుకు రైతు భరోసా పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈనెల ఆఖరి అవరు కౌలు రైతు కార్డులకు నమోదు చేసుకోవచ్చని, అర్హత గల రైతు ఆర్‌బీకే కేంద్రాలను సంప్రదించాలన్నారు. అవగాహనలో కౌలు రైతులు, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై కంది విత్తనాలు



నరసరావుపేట రూరల్: ఆహార భద్రత మిషన్ పథకంలో వంద శాతం రాయితీపై రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. లింగంగుంట్ల–1 గ్రామసచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు అందరూ సీసీఆర్‌సి కార్డులు తీసుకోవాలని తెలిపారు. ఆర్‌బీకే సిబ్బంది, వీఆర్‌ఓలను సంప్రదించి కార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్, ఈఓపీఆర్‌డీ కె.విజయ కుమార్, ఏడీఏ మస్తానమ్మ, ఏఓ వి.నరేంద్ర పాల్గొన్నారు.

పథకాలు చేరువ చేసేందుకే జగనన్న సురక్ష

- జేసీ శ్యాంప్రసాద్
- ఏనుగుపాలెంలో గ్రామసభ

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలెం గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ నూరుశాతం సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నచిన్న సాంకేతిక సమస్యలతో జనన, మరణ, కౌలురైతు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ నమోదులో సమస్యలు వంటి పత్రాలు అవసరమైన వారిని గుర్తించి గ్రామసభల్లో ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం రైతులకు అవసరమైన విత్తనాలను పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో మంగాపురనాథ్, ఇతర శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వినుకొండలో..

పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీ 1,2 సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకయ్య పాల్గొని మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నూజెండ్లలో...

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని పువ్వాడ, నూజెండ్ల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ఆధార్ నమోదు కేంద్రం, రైతులకు కంది విత్తనాలు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మదుబాబు, ఎంపీడీవో వీరభద్రాచారి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వరరెడ్డి, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు ఒంగూరి ప్రసాద్, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామసచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులకు మేలు చేయడమే ధ్యేయం

యడ్లపాడు: అర్హులందరికీ పథకాలు అందలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు చెప్పారు. మండలంలోని జాలాది గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన ఈ సదస్సులో లబ్ధిదారులకు కావల్సిన సర్టిఫికెట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా అర్జీలు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉండి ఇంకా పథకాలు దరిచేరని వారు ఎవరైనా ఉంటే జగనన్న సురక్ష సదస్సులో అర్జీలిస్తే పరిశీలించి పథకాలు అందజేస్తారన్నారు. అనంతరం కుల, ఆదాయ, రేషన్, ఆధార్ వంటి 96 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, మండల సచివాలయ కన్వీనర్ రాచమంటి చింతారావు, ఎంపీడీవో వై హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ వరూధిని, కార్యదర్శి సురేష్, ఘంటా రాము, పందుల బుల్లెబ్బాయి, తెనాలి అంకమ్మరావు, బొల్లినేని మదన్‌మోహన్ రావు, జరుగుల శేషగిరి, మానం శంకరరావు, ఉర్ల కొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఏనుగుపాలెంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జేసీ శ్యాంప్రసాద్



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు, నాయకులు



నూజెండ్లలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ జయరామిరెడ్డి



జాలాదిలో సర్టిఫికెట్‌ను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తూబాడులో జగనన్న సురక్ష కార్యక్రమం

నాదెండ్ల: ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగితే గానీ రాని ధ్రువీకరణ పత్రాలను రూపాయి ఖర్చు లేకుండా కేవలం గంటల వ్యవధిలోనే ప్రజలకు అందిస్తూ అత్యద్భుతమైన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారని జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్ రావు చెప్పారు. తూబాడు సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిధిలో 1725 గృహాలకు గాను 1269 గృహాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సందర్శించారు. 403 మంది లబ్ధిదారులకు అధికారులు, నాయకులు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోళ్ళమూడి కాశయ్య అధ్యక్షతన ఏర్పాటైన సభలో జెడ్పీటీసీ మస్తాన్‌రావు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన ప్రతికార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధిగా అమలు చేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఏవో హరి ప్రసాద్, గణపవరం, నాదెండ్ల సొసైటీల చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, నాయకులు మద్దూరి కోటిరెడ్డి, చందవరం వీరారెడ్డి, బుచ్చయ్య మాస్టారు, బ్రహ్మయ్య, రత్తయ్య, ఏరువా సుందరరెడ్డి, కాసు జార్జిరెడ్డి, ఉయ్యూరు చిన్నపరెడ్డి, గాదె శౌరిరెడ్డి, కాసు చిన్నపరెడ్డి, కోయలమూడి సాంబశివరావు, వీఆర్వో అశోక్, పంచాయతీ కార్యదర్శి జరీనా, ఎంఎల్‌వో రామయ్య, ఏపీవో పుష్పరాజు, డీటీ అనురాధ, ఆర్‌ఐ రమీజా, పాల్గొన్నారు.

వలంటీర్లు సమర్థవంతంగా పనిచేస్తున్నారు

వినుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి

నరసరావుపేట: వలంటీర్లు కోవిడ్ సమయంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందజేయడంలో సమర్థవంతంగా పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, వినుకొండ నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని 18వ వార్డు సచివాలయంకు ఎదురుగా బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలు తీర్చేందుకు గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం ఏర్పాటు చేసి ఎమ్మెల్యేలను గడపగడపకు వెళ్లి సమస్యలు తెలుసుకునే విధంగా చేశారన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయాలనే ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. వలంటీర్లు, గృహసారథులు సమన్వయంతో సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. కమిషనర్ రామ్మోహన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి అందజేయాలనే ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష నిర్వహిస్తున్నారన్నారు. ఈసందర్భంగా 18, 19 వార్డులకు చెందిన ప్రజలు దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ జబ్బార్, నాయకులు వేముల శివ, జమ్ముల రాధాకృష్ణ, బ్రహ్మారెడ్డి, రవివర్మ, చంద్రశేఖర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి ధ్రువపత్రం అందజేస్తున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి, కమిషనర్ రామ్మోహన్

దరఖాస్తు చేశా.. వెంటనే ఇచ్చారు!



మా పిల్లలకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటూ కౌలు రైతు గుర్తింపు కార్డు కోసం నేను దరఖాస్తు చేసుకున్నా. గంటల వ్యవధిలోనే పత్రాలు చేతికందాయి. గతంలో ఇలాంటి పత్రాలు అందాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు తప్పేవికావు.

–గోళ్ళమూడి మరియమ్మ

ఫోన్ చేసి మరీ పత్రాలు ఇచ్చారు



నాది పేద కుటుంబం. ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. వారికి అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేశా. సచివాలయ సిబ్బంది నాకు ఫోన్ చేసి ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి.. తీసుకోమని చెప్పారు. రూపాయి ఖర్చు లేకుండా పత్రాలు అందాయి.

– షేక్ మస్తాన్‌బుడే

రీసర్వే వేగవంతం చేయాలి

ఈపూరు: రీసర్వే పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. రీ సర్వే పనులను పూర్తయి పాస్ పుస్తకాలు వచ్చిన గ్రామాలకు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. అలాగే కౌలు రైతు కార్డులు కూడా నియమ నిబంధనల ప్రకారం అవగాహన కల్పించి అందజేయాలని, కౌలు రైతు కార్డులు కూడా ఎక్కువగా అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత కలిగిన కౌలు రైతుకు సాగుధ్రువీకరణ పత్రాలు

శావల్యాపురం: అర్హత కలిగిన కౌలు రైతులందరికీ పంట సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు శ్యాంప్రసాదు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 55 వేల మంది కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నామని, అందులో భాగంగా ఇప్పటి వరకు 25 వేల మంది కౌలు రైతులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. అర్హత కలిగిన ప్రతి కౌలు రైతుకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేసి పంట సాగు పత్రాలను అందజేయాలన్నారు. సర్వర్ సమస్య కారణంగా రీసర్వే పనులు జాప్యం అవుతున్నాయని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, జాయింట్ కలెక్టరు దృష్టికి తేగా సమస్య పరిష్కారిస్తామన్నారు. ఆగష్టు నెలలో నూతన రైస్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం నుంచి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు మంజూరు చేయటమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం రీసర్వే పనులపై రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, ఆర్‌ఐ చంద్రబాబు, వీఆర్వోలు ఉన్నారు.



సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

ఉపాధి హామీపై గ్రామ సభ

రొంపిచర్ల: స్థానిక సచివాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో గత ఏడాది నిర్వహించిన రూ.32 లక్షల రూపాయల వేతనాలు విడుదలపై సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు డీఆర్పీ మోహన్ అన్నారు. కూలీలు నిర్వహించిన పనులకు, వారి హాజరు మచ్చర్లకు సరిపోగా రూ.800 రూపాయలు సంతకాలు, నిశానిలు లేకుండా వేతనాలు పొందినట్లు తెలిపారు. ఆ కూలీలను విచారించారు. పని ఒత్తిడి వల్ల, పనుల్లో నిమగ్నమై సంతకాలు, వేలిముద్రలు వేయలేక పోయామని గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ వారి వాదనపై ఉన్న వాస్తవాన్ని గ్రహించి ఆమోదించారు. ఈ గ్రామ సభలో సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావు, పడాల చక్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఏపీవో కోటా ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు మెట్లు, కూలీలు పాల్గొన్నారు.


కొమర్రాజుకు ఘన నివాళి

నరసరావుపేట ఈస్ట్: తెలుగు సాహిత్య, చారిత్రక పరిశోధకుడు కొమర్రాజు వెంకటలక్ష్మణరావు శత వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం పనసతోటలోని శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కళావేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి గుండాల రాకేష్ మాట్లాడుతూ, తెలుగులో తొలి విజ్ఞాన సర్వస్వం రచయితగా, విజ్ఞాన చంద్రికా మండలి వ్యవస్థాపకునిగా కొమర్రాజు అందించిన సేవలు నిరుపమానమన్నారు. తెలుగువారికి చరిత్ర పరిశోధనలను పరిచయం చేయటంతోపాటు చరిత్ర, విజ్ఞాన రచనలను తెలుగులో అందించి తెలుగు జాతిని మేల్కొలిపిన మహానుభావుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు కరిష్మా, అమరలింగేశ్వరరావు పాల్గొన్నారు.

స్వల్ప వివాదం.. వ్యక్తిపై దాడి

నరసరావుపేట టౌన్: స్వల్ప వివాద నేపథ్యంలో వ్యక్తిపై ముగ్గురు యువకులు దాడికి పాల్పడిన సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివుడిబొమ్మ సెంటర్ సమీపంలోని బంగారపు దుకాణంలో పావులూరి సురేష్ గుమస్తాగా పనిచేస్తున్నాడు. అక్కడకు వచ్చిన నజీర్ మరో ఇద్దరితో స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సురేష్‌పై ముగ్గురు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



నరసరావుపేట రూరల్: జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మండలంలోని ఇస్సప్పాలెం గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప నుంచి బుధవారం నియామక పత్రం అందుకున్నారు. జిల్లాలో కమిటీలను ఏర్పాటుచేసి చేనేత వర్గాల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

అ'పూర్వ' విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: పూర్వ విద్యార్థిగా చదువుకున్న కళాశాల రుణం తీర్చుకుంటున్నాడు కొత్తా శేషుకుమార్. పట్టణంలోని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఇంటర్మీడియేట్, డిగ్రీ విద్యను పూర్తిచేసుకున్న శేషుకుమార్ ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ)లో మాస్టర్ డిగ్రీ సాధించి హైదరాబాద్‌లో సొంతంగా 2022లో పుర్వ్యా లైఫ్ సైన్స్ ఫార్మా కంపెనీ స్థాపించాడు. తన ఉన్నతికి దోహదపడిన కళాశాలకు చేతనైనంత సాయం చేసేందుకు ముందుకు వచ్చిన శేషు కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి తనవంతు విరాళంగా రూ.16 లక్షలు అందించటంతోపాటు తమ కంపెనీలో కళాశాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాడు. కళాశాల విద్యార్థులకు ఇంటర్నషిప్ కల్పించటంతో పాటు ప్రతిభ కలిగిన వారికి తన కంపెనీలోనే ఉద్యోగం ఇస్తూ విద్యార్థులకు అండగా ఉన్నాడు. తన తండ్రి సీతారామాంజనేయుల నుంచి వారసత్వంగా కళాశాల పాలకవర్గ సభ్యునిగా నియమితుడైన శేషుకుమార్ కళాశాల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ధన్యజీవి సుబ్బరాయశ్రేష్ఠి



నరసరావుపేట ఈస్ట్: ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ఆరు దశాబ్దాల క్రితమే అందించిన నాగసరపు సుబ్బరాయశ్రేష్ఠి ధన్యజీవి అని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి సుబ్బరాయశ్రేష్ఠి 66వ వర్ధంతిని బుధవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ, పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి అరవై ఏళ్ల క్రితమే ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతిగది, కర్మల సత్రం, మంచినీటి అవసరాలను తీర్చేందుకు నాగసరపు బావి, శ్రీపట్టాభిరామస్వామి ఆలయం, మంచినీటి చలివేంద్రంతో పాటు పాఠశాల, కళాశాలను ఏర్పాటు చేసిన దాత సుబ్బరాయశ్రేష్ఠి అని కొనియాడారు. కార్యదర్శి ఎస్.సుబ్బరాయ గుప్త, ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య పాల్గొన్నారు.

వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పు!

వినుకొండ(నూజెండ్ల): ఏలూరు సభలో వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు మండిపడ్డారు. వ్యాఖ్యలపై నిరసనగా వినుకొండ మండలానికి చెందిన వలంటీర్లు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛందగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై ఇలా మాట్లాడటం సరికాదని, తాము చేసే సేవలను గుర్తించకుండా అసభ్య పదజాలంతో దూషించడం చాలా బాధాకరమన్నారు. మీ ఇంట్లోని వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందించాలంటే వలంటీర్లతోనే సాధ్యమని తెలుసుకోవాలన్నారు. మీరు చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు చూపించాలని లేకపోతే మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రస్థాయిలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు

సుదీర్ఘ సమస్యకు మోక్షం

- ఈనాం భూముల రైతులు హర్షం
- గత టీడీపీ తప్పిదాన్ని సవరిస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం
- ఆనందంతో సీఎం చిత్రపటానికి రైతులు క్షీరాభిషేకం

యడ్లపాడు: పాదయాత్రలో రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర కేబినెట్‌లో ఈనాం భూముల అంశాన్ని ప్రవేశపెట్టి బుధవారం ఆమోదించడంపై ఈనాం భూముల రైతులు హర్షం వ్యక్తం చేశారు. యడ్లపాడు మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని చారిత్రక ఆలయమైన వెన్నముద్దల బాలకృష్ణుని కొవెల వద్ద సీఎం చిత్రపటాన్ని ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గత ప్రభుత్వాల తప్పిదాల వల్ల వీధినపడ్డ వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న వైఎస్సార్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండల సచివాలయ కన్వీనర్ రాచమంటి చింతారావు, సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో రైతులు మాట్లాడుతూ 1956లో ఈనాం ఎబాలిషన్ యాక్ట్ ఇన్ రైత్వారీ కింద నాటి ప్రభుత్వం తమకు సర్వహక్కులతో కూడిన భూ పత్రాలను మంజూరు చేశాయన్నారు. నాటి నుంచి ఆయా భూములు క్రమవిక్రయాలు జరిగి ఎందరో చేతులు మారాయని తెలిపారు. అయితే 2013లో 16/13 యాక్ట్‌తో ఈనాందారులు హక్కుల్ని అప్పటి ప్రభుత్వం హరించేశారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈయాక్టును సాకుగా చేసుకుని ఈనాం భూముల్ని మొత్తంగా నిషేధిత జాబితాలోకి చేర్చిందన్నారు. హక్కుదారుల పేర్లు తొలగి ఆలయాల పేర్లు మార్పు చేయడంతో ఈనాం సాగుదారులు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, న్యాయస్థానాల చుట్టూ ప్రదిక్షణలు చేస్తూ తీవ్ర మనస్థాపానికి గురయ్యామని చెప్పారు. అదే సమయంలో పాదయాత్ర చేపట్టిన జగనన్న దృష్టికి ఈ సమస్యను తీసుకురాగా అధికారం వచ్చాకా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ ఆరోతేదీన చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగంగుంట్ల గ్రామంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆవిష్కరణకు వచ్చిన సందర్భంగా మరోమారు రాష్ట వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ద్వారా సీఎంకు వివరించి వినతి అందించారు. త్వరలోనే తప్పక పరిష్కరిస్తామని చెప్పిన ప్రకారంగా గత ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల్ని సరిచేస్తూ ఈనాం భూముల్ని 22/1సీలో నుంచి తొలగించడానికి బుధవారం కేబినేట్ ఆమోదం కల్పించడంపై ఆనందోత్సవాలతో పాలభిషేకం చేసి జీవితాంతం ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామని చెప్పారు.



చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఈనాం రైతులు

జాతిని నిర్మించేది ఉపాధ్యాయులే

నాదెండ్ల: ఉత్తమ వ్యక్తిత్వం గల భావి భారత పౌరులతో జాతిని నిర్మించేది ఉపాధ్యాయులేనని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బదిలీపై వెళ్లిన ఆరుగురు ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సన్మానించారు. బదిలీపై వెళ్లిన రమాదేవి, ప్రసాద్‌రెడ్డి, కోటేశ్వరరావు, ఛాయన్న, సాంబశివరావు, జోస్పిన్‌లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సుందరరావు, కరిముల్లా, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు యన్నం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కనపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ బదిలీపై వెళ్ళిన తుర్లపాటి నగేష్ దంపతులను తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. గత ఏడున్నరేళ్లుగా ఈయన ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేస్తూ నకరికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు.